# అంజన

-మీనాక్షీ శ్రీనివాస్

"అంజనా అంజనా.. నా షూ పాలిష్ చేసిపెట్ట మన్నాను. పెట్టావా?" యిల్లెగిరిపోయేలా అరిచాడు సుమంత్.

వంటింట్లో డైనింగ్ టేబుల్ శుభ్రం చేస్తున్న అంజన పరిగెత్తుకుంటూ వచ్చింది. ఆ పరిగెత్తడంలో, కంగారులో వంటింటి గడప కుడికాలి గోటికి తగిలి.. గోరు చిట్లిపోయి రక్తం చిమ్మింది. అయినా అంజన కళ్ళలో నీళ్ళు తిరగలేదు. అసలా గాయాన్ని ఆమె పట్టించుకోలేదు.

"పా.. పాలిష్ చేసిపెట్టానండి" గుమ్మం దగ్గరే నిలబడి భయం భయంగా చెప్పింది.

"దీన్ని పాలిష్ అంటారా? షూ తీసి విసురుగా ఆమె మీదకు విసిరేశాడు.

అది ముందే ఊహించిన ఆమె చటుక్కున పక్కకి తప్పుకుంది.

ఛ.. ఛ... ఒక్క పని సరిగా రాదు. ఎందుకొస్తుంది పెద్ద పెద్ద చదువులు వెలగబెట్టావుకదూ.. అందులోనూ యూనివర్సిటీ ఫస్టాయే.. పోనీ ఏదైనా ఉద్యోగం వెలగబెట్టి ఉద్ధరిస్తూందా అంటే అదీ లేదు. అసలు ఈ తద్దినాన్ని నా తలకెత్తిన అమ్మా.. నాన్నల్ని అనాలి."

ఇలాంటివి వినడానికి అలవాటుపడిపోయిన ఆ చెవులు ఆ మాటల్ని మనసు దాకా వెళ్ళనియ్యకుండా ఆపేశాయి. చేతులు యాంత్రికంగా ఆ షూస్‌ని మరోసారి పాలిష్ చేసి అతని ముందు ఉంచాయి.

తను ఎన్ని మాటలంటున్నా ఉలక్కుండా పలక్కుండా రాయిలా ఉన్న అంజనను చూస్తే అతని కళ్ళలో అమృతాంజనం తగిలినంతగా మండింది.

"యూ.. డర్టీ బిచ్" అకారణంగా నెట్టేశాడామెని. తూలిపడిన అంజన తల గోడకి తగిలి నుదురు చిట్లి రక్తం వస్తున్నా పట్టించుకోకుండా బయటకు వెళ్ళిపోయాడు.

నిస్తేజంగా.. నీరసంగా అలానే కూర్చుండి పోయింది అంజన. "తప్పు చేశావ్ అంజనా.. చాలా పెద్ద తప్పు చేశావ్" ఈ నాలుగు నెలల్లోనూ ఆమె ఈ మాట అనుకోవడం యిది ఎన్నోసారో ఆమెకే తెలియదు.

సుమంత్ అందంలో.. ఆస్తిలో.. చదువులో.. ఉద్యోగంలో– అన్నింటిలోనూ ఆమెకు తగినవాడే. కాని అంతరంగాల్లో మాత్రం చాలా తేడా ఉంది. అది తెలియక తనూ, తన తల్లిదండ్రులూ మోసపోయారు. తమకే కాదు అతని అసలు స్వరూపం అతని తల్లిదండ్రులకు కూడా తెలియదు. అది అతని గొప్పతనం. నివురుగప్పిన నిప్పులాంటి అతను తన జీవితాన్ని కార్చిచ్చులా కాల్చేస్తుంటే.. అలా జీవితాన్ని అతని అహంకారం అనే అగ్నికి ఆహుతి చేసి అంతం అయిపోవడమేనా? నో.. నెవర్. తను ఈ ప్రమాదం లోంచి బయటపడాలి. తన తెలివి.. చదువు యిలా ఎందుకూ కొరగాకుండా పోకూడదు.

చక్కగా తన చదువేదో, తనలోకమేదో అన్నట్లున్న తనని అతని చూపులు వెంటాడాయి. ఒకే వీధిలో ఉంటున్నా ముఖ పరిచయం తప్ప పరిచయమైనా లేని తనని పరిచయం చేసుకుని.. తన తల్లిదండ్రులతో మంచిగా ఉంటూ, "అంజూ ఎంత తెలివైన అమ్మా యండీ. అలాంటి భార్య దొరకడం చాలా అదృష్టం" అంటూ తన మీద యిష్టాన్ని.. అతని అభీష్టాన్ని చాలా తెలివిగా తెలియపరిచిన అతన్ని తన తల్లిదండ్రులు యిష్టపడ్డారు.

"అతనికి మన అంజూ అంటే చాలా యిష్టం అండీ.. ఎలాగూ దాని చదువు పూర్తయి ఉద్యోగంలో కూడా చేరిపోయింది కనుక యింక పెళ్ళి చేసేద్దాం.

మంచి చదువు.. ఉద్యోగం.. పెద్దగా బాదరబందీ లేమీ లేవు. అతని కుటుంబం కూడా మనకు తెలిసిన వాళ్ళే. పైగా మనమ్మాయిని బాగా యిష్టపడుతున్నాడు. ఓసారి వెళ్ళి వాళ్ళ వాళ్ళతో మాట్లాడదామండీ' అంటున్న అమ్మని తను పెద్దగా వారించలేకపోయింది.

అభ్యంతరం చెప్పడానికి తనకి కారణాలేం కనబడలేదు. కానీ అతనికి పెద్ద అమెరికన్ కంపెనీలో జాబ్ వచ్చిందనీ, త్వరలో అక్కడకు వెళ్ళిపోతాడని చెప్పినప్పుడు మాత్రం తను కాస్త ఆలోచించింది. తనకు అమెరికా వెళ్ళే ఉద్దేశం లేదని, తను చేసే ఈ కంపెనీలో తనకి జాబ్ శాటిస్‌ఫాక్షన్.. వాళ్ళు యిస్తున్న జీతం అన్నీ బాగానే ఉన్నాయి అని తను అన్నప్పుడేమన్నాడు అతను.

"నాకు కూడా అమెరికా మోజు ఏం లేదు అంజనా. కానీ మనం ఒక ఒన్ ఆర్ టూ యియర్స్ అక్కడ టెక్నాలజీ అంతా నేర్చుకుంటే పర్సనల్‌గా మనకూ – టక్నలాజికల్‌గా మన దేశానికి కూడా మంచిది" అన్న అతని మాటల్లో లాజిక్ తనని ఆలోచింప చేసింది. అదేటైములో తన కంపెనీ వాళ్ళే తనని ఒక ప్రాజెక్టు పనిమీద అమెరికా పంపాలని నిర్ణయించడం.. అంతా తన అదృష్టమనే మురిసి పోయింది కానీ కలలో కూడా తన బతుకిలా ఉంటుం దని ఊహించలేకపోయింది. ఒకేచోట ప్లేస్‌మెంట్ రావడం అనేది.. అందులోనూ అమెరికాలాంటి చోట

అంతా తమ అదృష్టాన్ని పొగుడుతుంటే తనూ మురిసిపోయింది.

పెళ్ళయిన నాలుగు నెలలకే తనకు కంపెనీ వీసా.. అంతా ఎరేంజ్ చేసి అమెరికా పంపారు. ఆ తరువాత రెండు మూడు నెలల దాకా అంతా బాగానే గడిచింది.

"అంజనా యిద్దరం ఉదయం నుంచి రాత్రి దాకా అలసిపోయి రావడం.. మళ్ళీ రొటీన్.. అసలు లైఫ్‌లో ఏం ఎంజాయ్‌మెంట్ లేదు. నేను సంపాదిస్తున్నది మన యిద్దరికీ చాలదా చెప్పు. నువ్వు హాయిగా జాబ్ మానేసి యింట్లోనే ఉండిపోకూడదా" అంటూ మొదలయింది.

అదంతా తన మీద ప్రేమతోనే అనుకుని తను మురిసిపోయింది. కానీ కంపెనీతో ఎగ్రిమెంట్ అయి, కంపెనీ ఖర్చుతో.. వాళ్ళ ఎరేంజ్‌మెంట్స్‌తో యిక్కడికి వచ్చి – యిప్పుడు అర్థాంతరంగా జాబ్ మానెయ్యడమన్నది ఎలా కుదురుతుంది. అయినా తనకదేం యిబ్బందిగా లేదనీ.. హాయిగానే ఉన్నానని అయినా యింత చదువు చదివి ఉద్యోగం మానేసి కూర్చోడం ఎందుకు అన్న ప్రశ్నకి అతను చూసిన చూపు యిప్పటికీ మర్చిపోలేకపోతోంది.

ఆఖరికి తను ఏం చెప్పినా వినడంలేదని, తను వర్క్‌లోడ్ ఎక్కువగా ఉండి వీకెండ్స్ యింట్లో చేసుకోవడానికి తెచ్చుకున్నప్పుడు, తనకి తెలియకుండా అతను తన ఎసైన్‌మెంట్ మార్చడం వలన తన కంపెనీకి చాలా లాస్ రావడం, వాళ్ళు తనని.. తన వర్క్‌ని అవమానించి ఉద్యోగంలోంచి పీకెయ్యడం అంతా కలలా జరిగిపోయింది.

అప్పటినుంచి బయటపడింది అతని అసలు బండారం. అతనికి తనంటేనే కాదు, అసలు ఆడవాళ్ళంటేనే చులకన. వాళ్ళు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపి పైకి రావడం ఓర్చుకోలేని మనస్తత్వం అతనిది అని తెలిసిన రోజు తను పడిన బాధ వర్ణనాతీతం.

"ఈ ఆడాళ్ళు పనీ పాటా లేకుండా కూర్చుని పుస్తకాలు బట్టీ పట్టేసి కాలేజీల్లోనూ, యూనివర్సిటీల్లోనూ మంచి మార్కులు కొట్టేసి వగలు, హొయలు చూపించి మంచి మంచి జీతాల్లో, మంచి ఉద్యోగాల్లో చేరిపోతున్నారే తప్ప అంతకంటే యింకేం కాదు" అంటున్న అతన్ని చూసి నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు తనకు మొదట్లో. కానీ తన పని ఏడవడమే అని అతనే డిసైడ్ చేసేశాడు.

మొదట్లో ఈటెల్లాంటి మాటలతో మనసుని విరిచేశాడు. అప్పటికీ తను మొండిగా కన్నీరు పెట్టకుండా తిరగడం చూసి మేన్ హేండిలింగ్ మొదలు పెట్టాడు.

తను ఎలాగయినా ఈ నరకం నుంచి బయట పడాలి. అందుకేమాత్రం అవకాశం లేకుండా తన చేతికి పైసా అందకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు. తను ఎవరికి ఏం చెప్పినా నమ్మకుండా తన గురించి అందరితోనూ తన జాబ్ పోయిందన్న ఫ్రస్ట్రేషన్‌లోనూ, డిప్రషన్‌లోనూ ఉన్నాననీ.. ఆ వెధవ జాబ్.. సంపాదన తనకు అంజూకన్నా గొప్ప ఏం కాదనీ.. తను ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నా నేను ఆ డిప్రెషన్‌లోంచి బయటపడడం లేదనీ యింటా బయటా అందరినీ నమ్మించేశాడు. అసలు.. రేపు తనని చంపేసి.. ఆత్మహత్యగా చూపించినా అంతా నమ్మేస్తారు. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. అందుకే తను చాలా ఆలోచించి అడుగెయ్యాలి. ఆలోచనలతో అసలు కాలమే తెలియలేదు అంజనకు. కడుపులో ఆకలి అరిచి అల్లరి పెట్టడంతో ఈ లోకంలోకి వచ్చి పడింది.

"అమ్మో అప్పుడే మూడయిపోయిందా. ఇంకా ఎక్కడి పని అక్కడే ఉంది. మళ్ళీ ఆ రాక్షసుడు వచ్చేలోపు ఇల్లంతా అద్దంలా సర్ది అన్నీ అరేంజ్ చెయ్యాలి. అయినా ఆలోచిస్తే మార్గం దొరకకపోదు. తను అర్థం పర్థం లేకుండా ఆలోచిస్తూ తినీ తినకా ఆరోగ్యం పాడుచేసుకోవడం నిజంగానే డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయే ప్రమాదం ఉంది. అప్పుడు నిజంగా వీడు చెప్పినట్టే జరిగిపోతుంది. తను బాగా ఆలోచించి అడుగెయ్యాలి. ఏది ఏమైనా తనని యిప్పట్లో యింట్లోంచి పంపడు. వాడికి నాతో ఆడుకోవడం మీద మోజు యింకా తీరిపోలేదు. అతడెంత తెలివిగా తనని బందీ చేశాడో తను అంతకంటే తెలివిగా అతడిని దెబ్బతీయాలి. తనలో ఏ తెలివితేటలు.. చూసి అతను ఓర్చుకోలేక

## ప్రజ్వలించే శక్తులం

నన్ను నమ్మిన వాళ్లకు
నేను నిచ్చెనలా నిలుస్తాను.
నాకు హాని తలపెట్టిన వాళ్లను
కాలనాగై కరుస్తాను.
మరి నేనెవరిని?
నేను నీతిని
నేను నిజాన్ని
నేను న్యాయాన్ని
నేను ధర్మాన్ని
మా అందరిదీ ఒకే గొంతు
మేము మానవత్వాన్ని
రక్షించే ప్రజ్వలించే శక్తులం

–రేగులపాటి కిషన్‌రావు

పోయాడో వాటితోటే అతనిని దెబ్బతీయాలి. అది ఎలాగా అనేది చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలి. ఈ ఆలోచన అంజనలో కొత్త ఉత్సాహాన్ని, ఊపిరిని నింపింది.

అతనికేమాత్రం అనుమానం రాని విధంగా మసలుకుంటూ అతను పెట్టే టార్చర్ భరిస్తూ తన కిష్టమైన సబ్జెక్టులో మంచి పట్టు సంపాదించి అమెరికన్ యూనివర్సిటీలో పిహెచ్‌డి సంపాదించాలి. అప్పుడు.. అప్పుడు తను భరిస్తున్న ఈ గృహ హింసకు ఓ ఫలితం ఉంటుంది. ఎస్! అదే చెయ్యాలి. ఎవరయితే తన తెలివితేటల్నీ, ఉన్నతినీ చూసి ఓర్చుకోలేక తనను టార్చర్ చేస్తున్నారో– వాడి నీడలోనే తను అనుకున్నది సాధించి విజేత కావాలి. ఆడవాళ్ళంటే ఆడుకునే బొమ్మలో.. కాళ్ళకింద చెప్పులో కాదని, వాళ్ళూ ప్రాణం, ప్రతిభ, పట్టుదల, సామర్థ్యం అన్నీ ఉన్న తనలాంటి ప్రాణులే అన్న సత్యం వాడు గ్రహించాలి, అంగీకరించాలి.

అంజన తెలివితేటలు పూర్తిగా అర్థం చేసుకోలేక పోయిన సుమంత్ ఆమె ఎక్కడ వెళ్ళిపోతుందో అని ఆర్థిక స్వాతంత్ర్యం అయితే లేకుండా చేశాడే కానీ మిగతా విషయాలు పట్టించుకోలేదు. తను ఆఫీసుకు వెళ్ళేక చకచకా పనులన్నీ చేసుకుని ఉదయం పదకొండు నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా తదేక దీక్షతో, పట్టుదలతో యింట్లో ఉన్న అతని పుస్తకాల నుంచే తనకు కావలసిన సమాచారం సేకరించుకుంటూ ఆ విషయం అతనికి తెలియకుండా జాగ్రత్త పడింది. అంజనది ఫొటోగ్రాఫిక్ మెమరీ. అది ఆమెకు చాలా ఉపకరించింది.

ఆమె థీసిస్ రెడీ చేసి ఫ్లాపీ రూపంలో పొందు పరిచింది. అది యూనివర్సిటీకి ఎలా చేర్చాలి అన్నదే యిప్పుడామె సమస్య.

అంజన ఓరిమితో విసిగిపోయాడు సుమంత్. అరచి అల్లరిపెట్టి గోల చేస్తుందనో, లేకపోతే తనను కనికరించమని, హింస పెట్టొద్దని బ్రతిమాలి దేబిరిస్తుం దనో ఎదురు చూసిన అతనికి ఆమె నిర్లిప్తత ఓ పెద్ద సవాల్ అయిపోయింది.

బ్రతిమాలదు, బెదిరించదు, కోప్పడదు, భయ పడదు, కన్నీరు పెట్టదు. అన్నింటికి అతీతంగా నిర్లిప్తంగా ఓ మౌనిలా ఉంటున్న 'ఆమె' అతనికి అర్థం కాలేదు. ఇన్నాళ్ళుగా ఆడిన ఈ హింసాట అతనికి బోర్ అయిపోయింది.

ఎలాగయినా ఆమెను వదిలించుకోవాలి అన్న ఆలోచన వచ్చేసింది. కానీ ఎవరికీ ఏ అనుమానం కలగకుండా చాలా నేచురల్‌గా ఉండాలి. ముందుగా తాము చాలా అన్యోన్యమైన జంట అని అందరూ గుర్తించాలి. తరువాత యింక అసలు పని.

"అంజనా.. సాయంత్రం మనం పార్టీకి వెడు తున్నాం. చాలా అందంగా, చక్కగా తయారవు." చాలా రోజుల తర్వాత.. కాదు కాదు చాలా నెలల తర్వాత వచ్చిన ఆ మాటలకు అయోమయంగా చూసింది.

"ఏమిటలా నిలువుగుడ్లేసుకు చూస్తావు. నే చెప్పింది తెలుగులోనే. అర్థం కావడంలా.. అయినా అంత పెద్ద చదువులు చదివిన నీకు యింత చిన్న విషయం అర్థం కాకపోవడమా.." పెళ్ళున నవ్వాడు.

తను బయటకు వెళ్ళబోతున్నానన్న విషయం ఒక్కటి అర్థం అయింది అంజను. అంతే ఆమెలో ఉత్సాహం ఉరకలేసింది.

ఎర్ర గులాబీ మొగ్గల్లాంటి ఆమె పెదాలు చిరునవ్వుతో అరవిచ్చుకున్నాయి.

ఒక్క క్షణం ఆమెకేసి తమకంగా చూసేడు సుమంత్. ఇంక కొద్ది రోజులలో ఎలాగూ తనకు దూరం కాబోతున్న ఆమెను యింక బాధపెట్ట దల్చుకోలేదు. అయినా తను అనుకున్నది సాధించాడు. ఆమె చదువు, తెలివీ, ఉద్యోగం, స్టేటస్ అన్నీ– అన్నీ నిర్వీర్యం అయ్యాయి. ఇక ఆమె ఒక అందాల బొమ్మ.. అంతే.. ఇక ఆమె మీద తనకెలాటి కోపం, పగ లేవు. సో.. ఉన్న కాసిని రోజులూ ఆమె మీద నిజమైన ప్రేమ కురిపిస్తా. దానివలన తనకు లాభమే కానీ ఎలాటి నష్టం లేదు కదా.. నవ్వు మెరిసింది అతని ముఖంలో.

అర్థంకాని ఆ చూపులనూ.. అతని మనోభావాలు తెలియనీయని ఆ నవ్వునీ అయోమయంగా చూసినా, తనను ఈ నిర్బంధం నుంచి బయటకు తీసుకెడతాడు అన్న విషయం మాత్రం అర్థం అయి చాలా ఆనందం కలిగింది ఆమెకు.

గత పది రోజులుగా తనని వేధిస్తున్న ప్రశ్నకు సమాధానం దొరికింది. ఇంత కష్టపడి తయారు చేసిన ఆ థీసిస్ బయటపడి యూనివర్సిటీ చేరడమెలాగా.. తను యింతకాలం పడ్డ కష్టం నిష్ఫలమేనా అన్న బాధతో నిజంగానే డిప్రెషన్ మొదలయ్యే పరిస్థితిలో అతను చెప్పిన ఈ విషయం నిజంగా ఆమెను చాలా ఆనందపరిచింది.

ఆ సాయంత్రం లేత నీలంరంగు డ్రెస్‌లో నీలాలు పొదిగిన నగలతో సంధ్యా సుందరిలా తయారయిన ఆమెను మనస్ఫూర్తిగానే అభినందించి దగ్గరకు తీసుకున్నాడు సుమంత్.

తన థీసిస్ ఫ్లాపీని, దానితోబాటుగా దానిని హార్వర్డ్ యూనివర్సిటీలో పిహెచ్‌డికి సబ్‌మిట్ చేస్తున్న తన అప్లికేషన్, దానితోబాటుగా దానిని ఎలాగయినా ఆ

యూనివర్సిటీకి అందజేయవలసిందిగా రిక్వెస్టు చేస్తూ ఓ స్లిప్ రాసి దానిని జాగ్రత్తగా తన దుస్తులలో దాచుకుని తన ప్రయత్నం ఫలించాలని ఆ దేముడిని ప్రార్థిస్తూ బయలుదేరింది.

నీలం రంగు సూట్‌లో అంజన చేతిలో చేయి కలిపి, ఆ పార్టీలో అడుగుపెట్టిన సుమంత్.. అంజన అందరి కళ్ళకు విందయ్యారు. అనురాగంతో వెన్నంటే ఉన్నట్లుగా ఆమెని ఒంటరిగా ఒక్క సెకను కూడా వదలక కాపలాగా ఉన్నాడు సుమంత్. పార్టీ అయిపోవస్తోంది. తనకు మళ్ళీ యిలాంటి అవకాశం వస్తుందో రాదో అన్న ఆందోళన కుదిపేస్తోంది అంజన మనసుని. దేముడిని మనసులోనే పదే పదే ప్రార్థిస్తోంది.

ఆ దేముడు ఆమె మొర ఆలకించాడా అన్నట్టు మందు బాగా ఎక్కువైన ఓ మందుబాబు తూలి సుమంత్ సూటు మీద మందు ఒలకబోశాడు. అది క్లీన్ చేసుకుందుకు సుమంత్ టాయ్‌లెట్‌కు వెళ్ళగానే అప్పటికే అందరినీ చదివేసిన అంజన గబగబా ఒకతని దగ్గరకు వెళ్ళి.. ఆ కవరు చేతిలో పెట్టి ఎలాగయినా తనకు ఆ సాయం చేసిపెట్టమని రిక్వెస్ట్ చేసి చిటికెలో వచ్చి యథాస్థానంలో కూర్చుంది.

బాత్‌రూం లోంచి ఆదరా బాదరాగా వచ్చిన సుమంత్ అక్కడే కూర్చుని ఎటో చూస్తున్న అంజనను చూసి అమ్మయ్య అనుకున్నాడు. ఇదంతా ఏమిటో అర్థం కాకపోయినా విషయం అర్థం చేసుకున్న ఆ అమెరికన్ ఆ కవరు కోటులోకి తోసేసి అంజనకు కళ్ళతోనే ప్రామిస్ చేశాడు.

అంజన ఎవరో.. థీసిస్ తన ద్వారా ఎందుకు సబ్మిట్ చెయ్యమందో తెలియకపోయినా అతను చాలా సిన్సియర్‌గా అంతకన్నా పర్సనల్ యింట్రెస్టుతో ఆ యూనివర్సిటీకి థీసిస్ సబ్మిట్ చెయ్యడమే కాకుండా.. అది త్వరగా ప్రాసెస్ అయి అంజనకు డాక్టరేట్ డిక్లేర్ అవగానే ఆ పేపర్స్ అన్నీ స్వయంగా ఆమె అందులో యిచ్చిన అడ్రసు వెతుక్కుంటూ మరీ వచ్చాడు.

సుమంత్.. ఆమె చావుకు పెట్టిన ముహూర్తం.. అమెరికన్ ఆ డాక్టరేట్ చేయడానికి అనుమతి ఇచ్చిన యూనివర్సిటీ పత్రాలతో ఆ యింటికి చేరిన ముహూర్తం ఒకటే కావడం అంజన అదృష్టం.

"అంజనా.. అదృష్టమో.. దురదృష్టమో నీ అధ్వాన్న జీవితానికిక తెర పడబోతోంది. దేశం కాని దేశంలో అయినవాళ్ళెవరూ దగ్గర లేకుండా.. సుమారు సంవత్సర కాలం అష్టకష్టాలు పడిన నీకు ఈ చివరి క్షణంలో మృత్యువునీ నేనే.. ఆప్తుడినీ నేనే కావడం.. రియల్లీ గ్రేట్ కదూ. అందుకే నీకో అవకాశం యిస్తున్నా.. నువ్వు చివరిసారిగా ఏదైనా కోరుకో.. అదియున్నా నీ ప్రాణాల్ని దక్క..." యమధర్మరాజు సావిత్రిని అడిగినట్లుగా అడిగాడు సుమంత్.

గత రెండు నెలలుగా అతను చూపిస్తున్న ప్రేమనూ.. అతని తీరునూ ఎలా అర్థం చేసుకోవాలో తెలియక.. అతను నిజంగా మారి మనిషయ్యాడా.. లేక యిదో కొత్త డ్రామానా అన్న డైలమాలో ఉన్న అంజనకు అసలు విషయం అర్థమైంది. అంటే తన జీవితం ఇక్కడే.. యితని చేతిలోనే అంతం కాబోతుందా? నో... అలా జరగడానికి వీల్లేదు. ముందు కాసేపు అతనిని కబుర్లలో పెడితే ఈలోగా ఎలా తప్పించుకోవడం అన్నది ఆలోచించాలి. కానీ తనకు అంత సమయం ఉన్నట్టు లేదు. చేతికి చిక్కిన పిట్ట ఎటుపోతుందిలే అన్న ధీమాతో ఉన్నాడు సుమంత్. అంతగా అయితే అతనిని చంపి అయినా తను తప్పించుకోవాలి. అయినా కోటి ఆశలతో అతని చెయ్యి అందుకుని యింత దూరం వచ్చిన తనకు యిలాంటి పరిస్థితి ఎందుకు వచ్చింది?

"ఏమిటి – ఆలోచిస్తున్నది? ఎలా తప్పించుకోవాలనా..? నో.. వే..." అతని అందమైన ముఖంలో వికృతానందం.

"అది కాదు నేనాలోచిస్తున్నది. అసలు ఏమాశించి అందమైన మన జీవితాలను యిలా చేస్తున్నావో.. నేనంటే నీకెందుకు పగో.. నాకెంత ఆలోచించినా అర్థం కావడంలేదు. సుమంత్ నాకు ఏం తక్కువయిందని నన్నిలా హింసించి అంతం చెయ్యాలనుకుంటున్నావు? అందం, తెలివి, మంచి చదువు, సంపాదనా వున్న నన్ను, కావాలని వెంటపడి ప్రేమించి మరీ పెళ్ళి చేసుకున్నావే. మరి ఎందుకింత రాక్షసంగా ప్రవర్తిస్తున్నావో తెలుసుకోవాలన్న కుతూహలం తప్ప నాలో యింకే ఆలోచనలూ లేవు. చెప్పు, యిదంతా ఎందుకు చేస్తున్నావు? నాకు తెలిసి నేను నీకేరకమయిన అన్యాయం చెయ్యలేదు. మరి నీ ఈ పగకు కారణం

## బాధాస్మృతి

కృత్రిమమంతా తాత్కాలికమైన
మిడిసిపాటుతో లోపభూయిష్టంగా
సాగుతుంది.
సహజ స్థాయి సుఖం శోభనిస్తుంది
పరిరక్షణ భావం కుంటుపడితే
క్రమతతో కూడిన అందం
ఎగిరిపోతుంది.

–జి. శ్రీశైలం

ఏమిటి? కనీసం అది తెలిస్తే అయినా నే ప్రశాంతంగా కన్నుమూస్తాను."

నిజంగానే ఆ ప్రశ్న తన మెదడుని తొలిచేస్తుండగా అడిగింది అంజన.

"అదే.. నువ్వున్నావే యిప్పుడు నాకేం తక్కువ.. అందం, తెలివి, చదువూ... వగైరా అవే.. అవన్నీ నీలో ఎక్కువగా వుండటమే నా ఈ ప్రవర్తనకు కారణం. అందుకే నిన్ను వెంటపడి ప్రేమించి మరీ పెళ్లి చేసుకున్నది. ఇంత దూరం తీసుకు వచ్చింది. ఇప్పుడు నిన్ను చంపేశాక. మళ్లీ యింకో అమ్మాయిని.. అన్ని మెరిట్స్ వున్న అమ్మాయిని చేసుకుంటాను. దాన్నీ యిలాగే.. హ..హ..హ..." భయంకరమైన శాడిజం కనిపిస్తోంది అతని ముఖంలో.

"అదే.. ఎందుకలాగా? అలా చేస్తే నీకొరిగేదేముంది? పైగా.. మనిషిని చంపి తప్పించుకోవడం అంత సులువేం కాదు. దొరికిపోయావంటే యింక నీ జీవితం అక్కడితో ముగుస్తుంది..." అంటున్న అంజనతో..

"దొరికిపోవడమా.. అది కలలో మాట. ఇకపోతే యిదంతా ఎందుకు చేస్తున్నానంటావా? అదేమో- నాకు చిన్నప్పటి నుంచీ బాగా చదివి.. తెలివి తేటలతో ఉన్న అమ్మాయిలంటే కోపం. అసలు అలాంటి వాళ్ళనందరినీ చంపెయ్యాలని ఉంటుంది. కానీ ఎలా.. అందుకే యిలా" పళ్ళన్నీ బయటపెట్టి నవ్వుతున్న అతనిలో తోడేలు కనిపించింది అంజనకు.

"ఎలా.. ఎలా తప్పించుకోవడం ఈ రాక్షసుడి నుంచి...?"

షార్ప్‌గా ఆలోచిస్తున్న అంజనకు కారు ఆగిన శబ్దం.. ఎవరో తమ యింటివైపుగా వస్తున్న అలికిడి వినబడింది. అంతే యింక ఆగలేదు. ఆమె "హెల్ప్.. హెల్ప్.. హెల్ప్..." పిచ్చిపట్టినట్టు అరవసాగింది.

అలా అరుస్తుందనీ.. ఆ టైములో ఎవరో వస్తారని ఊహించని సుమంత్ ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు. వెంటనే తేరుకుని ఆమెని గట్టిగా పట్టుకుని నోరు నొక్కేశాడు.

అప్పటికే ఆ అరుపులు విన్న ఆ అమెరికన్ చాలా ఫాస్ట్‌గా రియాక్టయ్యాడు. లాక్‌చేసి ఉన్న డోర్‌ని రివాల్వర్‌తో షూట్‌చేసి తలుపు తెరిచి గబగబా.. సుమంత్ చేతిలో విలవిలలాడుతూ పెనుగులాడుతున్న అంజనను చూస్తూనే సుమంత్ ముఖం పగిలేలా కొట్టాడు.

ఇక తర్వాత.. ఏముంది సుమంత్‌ని పోలీసులు అరెస్టు చెయ్యడం, అంజనకు డాక్టరేట్ రావడం. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అంజన ముఖ పరిచయమైనా లేని ఆ అమెరికన్ చేసిన సహాయానికి ఎంతో ఆనందించి.. తన డాక్టరేట్ రావడంలో అతని సహాయాన్ని ఎంతైనా గొప్పగా పొగిడినా.. తన డాక్టరేట్ రావడానికి ప్రథమ స్థానం మాత్రం సుమంత్‌దే అని చెప్పడం అందరినీ ఆశ్చర్య పరిచింది.

"అవును.. నేను డాక్టరేట్ చెయ్యాలని చిన్నప్పటి నుంచీ అనుకున్నా యింత త్వరగా.. అదీ యింత ప్రఖ్యాత విశ్వవిద్యాలయం ద్వారా దానిని పొందడం అనేది మాత్రం సుమంత్ మూలంగానే. అతని అసూయ, ద్వేషం.. పగలా మారడం వల్లనే.. లేకపోతే నేనూ అందరి ఆడపిల్లల్లానే పెళ్ళి.. పిల్లలు.. సంసారంలో పడిపోయేదాన్ని. కాని సుమంత్ అసూయా ద్వేషాలు నాలో పట్టుదలని పెంచాయి. జీవితాన్ని అర్ధరహితంగా ముగించకూడదు.. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలి అనే పాఠం నేర్చుకున్నాను నా పరిస్థితుల నుంచి. అందుకే నేనతనికి ఆజన్మాంతం కృతజ్ఞురాలిని. కానీ అతని పరిస్థితి తల్చుకుంటేనే బాధగా వుంది. మంచి చదువూ, చక్కటి ఉద్యోగం.. జీవితం అన్నీ చేజేతులా నాశనం చేసుకున్న అతనిని ఏమనాలి?

నేటి పరిస్థితులలో..

మీడియా ప్రభావం వలనో..

లేక మానసిక రుగ్మత వల్లనో యిలాటి ఆలోచనలు వచ్చినా..

ఏ సైక్రియాటిస్ట్‌నో కలిసి కౌన్సిలింగ్ తీసుకుని ఆ రుగ్మత నుంచి బయటపడే ప్రయత్నం చేయాలి కానీ యిలా.. జీవితం నాశనం చేసుకోవడం.. ప్చ్.. ఐ హేట్ హిమ్."

"అలాంటి పరిస్థితి ఎవరికైనా కలిగితే దయచేసి అలర్ట్ అవండి. అంతేకానీ ఎదుటివారి వినాశనాన్ని కోరుకుని మీరూ నాశనమవకండి. థాంక్యూ వన్ అండ్ ఆల్" అంటూ ముగించింది.

అంజన ధైర్యానికీ, మనోనిబ్బరానికీ.. సాధించిన విజయానికీ ఎడతెరిపి లేకుండా అలా కరతాళ ధ్వనులు మ్రోగుతూనే ఉన్నాయి అలాటి పరిస్థితులలో ఉన్న ఆడపిల్లలకు ఆలంబనగా.

ఈ ప్రోగ్రాం మొత్తం లైవ్ టెలికాస్ట్ వచ్చేలా ఏర్పాటు చేశారు ఆ యూనివర్సిటీ వారు అంజన అభ్యర్థన మీద. ఎందుకంటే ప్రపంచం నిండా చాలామంది అలాటి అంజనలూ ఉన్నారు.. యిలాటి సుమంత్‌లూ వున్నారు మరి. అలాంటి వారికిదో హెచ్చరిక...

ఓ స్ఫూర్తి...

ఓ మార్గదర్శకం... ■